క్లుప్తంగా

తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్

మెదక్: భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసినట్లు ఏరియా మార్కెటింగ్ మేనేజర్ గంగాధర్ రెడ్డి తెలిపారు. శనివారం మెదక్‌లోని శ్రీ రామలింగేశ్వర ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ మేనేజర్ సునీల్ మాట్లాడుతూ సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న వికాట్ గ్రూప్ కంపెనీస్ ప్రపంచంలో 11 దేశాలలో విస్తరించిందన్నారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణం చాలా వేగంగా పూర్తవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్‌తో స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అన్నారు. సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందిస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని తెలిపారు. ఇంటి నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి క్లుప్తంగా వివరించారు. మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ సతీశ్, టెక్నికల్ ఇంజనీర్ ప్రశాంత్, డీలర్ లింగమూర్తి, కంపెనీ ప్రతినిధులు, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

తుక్కుగూడ సభను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంద్రకరణ్‌రెడ్డి

కొల్చారం(నర్సాపూర్): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం తుక్కుగూడలో నిర్వహించే భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులగారి మల్లేశం గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా గాంధీకి కృతజ్ఞత తెలిపే అవకాశం వచ్చిందన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో ఆదివారం నిర్వహించే సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్‌పార్టీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంద్రకరణ్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన మెదక్ వచ్చిన సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సోనియా గాంధీ తుక్కుగూడ సభలో పాల్గొంటారని, మెదక్ నియోజకవర్గం నుంచి పది వేల మందికి తగ్గకుండా రావాలన్నారు.

క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా

నర్సాపూర్: తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నాగరాజు, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ మాట్లాడారు. ఆరు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలవంతంగా నిర్వహించడం సరికాదన్నారు. ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి


వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్ నరసింహారెడ్డి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ నుంచి నస్కల్, నందగోకుల్, తుజాల్‌పూర్, బీబీపేటకు బస్సు సౌకర్యం కల్పించాలని మెదక్ డిపో మేనేజర్‌కు శనివారం చల్మెడ సర్పంచ్ నరసింహారెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి బస్సు సౌకర్యం లేక గ్రామస్తులు, విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారన్నారు. డిపో మేనేజర్ స్పందించి బస్సు సర్వీసు పునరుద్ధరిస్తామని చెప్పారన్నారు.

సస్యరక్షణతో పంటలు భద్రం

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు పంటసాగులో సరైన సస్యరక్షణ పాటిస్తే పంటలు భద్రంగా ఉండటంతో పాటు, అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చండూర్ రైతులు సాగుచేస్తున్న పత్తి, వరి పంటలను పరిశీలించారు. పత్తి పంటలో తామర పురుగు ఉధృతి పరిశీలించడం జరిగిందన్నారు. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.5 ఎంఎల్, లేదా ఫిప్రోనిల్ 1 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరిలో ఎండుతెగులు నివారణకు అగ్రిమైసిన్ 0.2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారా చేసుకోవాలన్నారు.

మట్టి గణపతికి జై

పర్యావరణానికి హాని కలిగించని మట్టి గణేశ్ విగ్రహాలకు పూజలు చేయాలని ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పిలుపు ఇచ్చారు. వినాయక చవితిని పురస్కరించుకొని విత్తన గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. అలాగే పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులతో మట్టి వినాయక విగ్రహాలు తయారు చేసేవిధంగా ప్రోత్సహించారు. గ్రామాల్లో మట్టి గణపతికి పూజ చేయాలని విద్యార్థులు ప్రచారం చేశారు.


చిలప్‌చెడ్‌లో మట్టి గణపతులను పంపిణీ చేసిన ఎంపీపీ వినోదరెడ్డి


మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి


కౌడిపల్లి: మనంతయపల్లి తండా పాఠశాలలో తయారు చేసిన మట్టివినాయకులు


నాగులపల్లి బంజారానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..


రంగంపేటలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న నాయకులు


చల్మెడ గ్రామంలో..


చెట్ల తిమ్మాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో..


వల్లభాపూర్ ప్రాథమిక పాఠశాలలో..

విద్యార్థులు ఆటల్లోనూ రాణించాలి


జెండా ఊపి క్రీడలను ప్రారంభిస్తున్న డీఎం సుధ

- ఆర్టీసీ డిపో మేనేజర్ సుధా

మెదక్: ప్రతీ విద్యార్థి ఆటలు ఆడాలని ఆర్టీసీ డిపో మేనేజర్ సుధ అన్నారు. శనివారం పట్టణంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2023 క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తాను కూడా జాతీయ స్థాయిలో అథ్లెటిక్స్ పోటీలో పాల్గొని పతకం సాధించానన్నారు. పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మెదక్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఏ. మధుసూదన్, మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, మాధవరెడ్డి, రవి, సుజాత శ్వేత, పృథ్వీ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల్లో మాక్‌పోలింగ్


చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్


కౌడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజాస్వామ్యంలో ఓటుహక్కును వినియోగించుకోవాలని చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్ అన్నారు. శనివారం చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధమన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ వెంకటరామారావు ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికలలో ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో తెలిపారు. మాక్‌పోలింగ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని లెక్చరర్లు మణికాంత్, సురేందర్‌రెడ్డి పర్యవేక్షించారు.

గెలుపోటములు సహజం

శివ్వంపేట(నర్సాపూర్): క్రీడల్లో గెలుపోటములు సహజమని ఓటమి గెలుపునకు నాంది అని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. మండల పరిధి గోమారం ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్‌లో నిర్వహించిన మండల స్థాయి ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో విజేతకు శనివారం రాత్రి బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్య, ఎంపీటీసీ నర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ

నర్సాపూర్: సెప్టెంబరు 17 తెలంగాణ విమోచన దినోత్సవం జరపాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం చౌరస్తాలో మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పట్టణ కార్యదర్శి అక్షయ్‌గౌడ్ మాట్లాడుతూ సెప్టెంబరు 17వ తేదీన తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జరపాలన్నారు. ప్రజలంతా తెలంగాణ విమోచన దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయిస్తే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విలీన దినంగా జరుపుకోవాలని నిర్ణయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సాయి, కార్తీక్, అభిలాష్, శ్రీధర్, ఆవాజ్, భాను తదితరులు పాల్గొన్నారు.

గజగట్లపల్లిలో మద్యనిషేధం

చిన్నశంకరంపేట(మెదక్): బెల్ట్‌షాప్‌లకు చెక్ పెట్టేందుకు మండలంలోని గజగట్లపల్లి గ్రామంలో మద్యనిషేధం విధించారు. ఈనెల 20వ తేదీ నుంచి గ్రామంలో మద్యం విక్రయించొద్దని, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగొద్దని గ్రామపెద్దల సమక్షంలో గ్రామస్తులు తీర్మానం చేశారు. తీర్మానం కాపీని అధికారులకు అందజేశారు. సర్పంచ్ మీనారవీందర్, ఉపసర్పంచ్ యాదగిరి తెలిపారు.

సమ్మెకు సిద్ధం కావాలి

మనోహరాబాద్(తూప్రాన్): జీపీ కార్మికులు మరోమారు సమ్మెకు సిద్ధం కావాలని పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ పిలుపునిచ్చారు. మనోహరాబాద్‌లో పంచాయతీ కార్మికులతో కలిసి మాట్లాడారు. గతంలో సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ చేపడుతున్న సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

రెండు బైక్‌లు ఢీ : ఒకరికి గాయాలు

అల్లాదుర్గం(మెదక్): రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్వెర ఐబీ చౌరస్తాలో శనివారం సాయంత్రం జరిగింది. గోలకుంట తండాకు చెందిన రమేశ్ వట్‌పల్లి నుంచి తండాకు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా మరో బైక్ ఢీ కొనడంతో రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 అంబులెన్సులో జోగిపేట ప్రభుత్వ అనుపత్రికి తరలించారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు చెరువుల పండుగ


ఎంపీడీఓ, ఎంపీపీని ప్రశ్నిస్తున్న సర్పంచ్‌లు

- సొంత డబ్బులతో వేడుకలు నిర్వహించామన్న సభ్యులు
- కొంతమేర మాత్రమే డబ్బులు ఇచ్చారని ఆవేదన
- డబ్బులు వచ్చేందుకు కృషిచేస్తామన్న ఎంపీపీ
- ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ చిందం సబిత

రామాయంపేట(మెదక్): ఇటీవల నిర్వహించిన చెరువుల పండుగకు సంబంధించి డబ్బులిప్పించాలని శనివారం జరిగిన నార్సింగి ఎంపీపీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు విజ్ఞప్తి చేశారు. శనివారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శేరిపల్లి, సంకాపూర్ సర్పంచులు మల్లేశం, సుజాత మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాము సొంత డబ్బుతో ఘనంగా చెరువుల పండుగ కార్యక్రమం నిర్వహించగా, కొన్ని డబ్బులు మాత్రమే వచ్చాయన్నారు. ఈ విషయమై జెడ్పీ సమావేశంలో మాట్లాడి సమస్య పరిష్కారానికై కృషి చేస్తామని ఎంపీపీ చిందం సబిత హామీఇచ్చారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని శేరిపల్లి సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. శేరిపల్లి గుండు చెరువుకు బుంగపడి ప్రమాదకరంగా మారిందని, దీనిని వెంటనే మరమ్మతు చేయించాలని సర్పంచ్ ఎంపీటీసీ సంతోష, ఎంపీపీ సబిత, ఎంపీడీఓ ఆనందమేరీ, నీటి పారుదలశాఖ ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచ్‌లకు, అధికారులకు ఐకేపీ సీఏలు సహకరించడంలేదని ఎంపీపీ సబిత ప్రస్తావించారు. తీరు మార్చుకోకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ హెచ్చరించారు. రోగులను వైద్య సిబ్బంది పట్టించుకోవడంలేదని ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కరీం మాట్లాడుతూ 18 ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.

సమన్వయంతో అభివృద్ధి పనులు పూర్తి

- సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం
- మండల సమావేశంలో ఎంపీపీ హరికృష్ణ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హరికృష్ణ

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రభుత్వం నిర్దేశించిన పనులు త్వరగా పూర్తవుతాయని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల గురించి సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. శివ్వంపేట బస్తీ దవాఖాన నిర్మాణం కోసం స్థల ఎంపిక చేస్తే అధికార పార్టీ నాయకులు అడ్డుకుంటున్నారని సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. పలు గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరాకావడం లేదని సభ్యులు వాపోయారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన పంచాయతీలకు భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని త్వరగా పూర్తి చేసేలా సర్పంచ్‌లు కృషి చేయాలన్నారు. ప్రతీ పంచాయతీకి ప్రభుత్వం రూ.15 లక్షలు మంజూరు చేసిందని, వాటితో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్ చారి, ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిషన్, ఆత్మకమిటీ చైర్మన్ గౌరై వెంకట్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చేసిన పనులే గుర్తింపునిస్తాయి

విధుల్లో చేసిన పనులే గుర్తింపునిస్తాయని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. శివ్వంపేట ఎంపీడీఓ నవీన్‌కుమార్ బదిలీ కావడంతో శనివారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన పనులు సక్రమంగా చేయించడంలో నవీన్‌కుమార్ కృషి అభినందనీయమన్నారు. జిల్లాలో శివ్వంపేట మండలాన్ని అభివృద్ధి పనుల్లో ముందుంచడంలో కీలకంగా వ్యవహరించాడన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది ఎంపీడీఓను సన్మానించారు.

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి


చిలప్‌చెడ్‌లో ఓటరు జాబితా అందిస్తున్న తహసీల్దార్ ముసాద్దీక్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఓటరు జాబితా పక్కాగా ఉండాలని తహసీల్దార్ ముసాద్దీక్ అన్నారు. శనివారం ఆయన చిలప్‌చెడ్ మండలంలోని 23 పోలింగ్ స్టేషన్‌లలో చునావ్ పాఠశాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ శనివారం చునావ్ పాఠశాల కార్యక్రమం నిర్వహిస్తామని, ఇందులో భాగంగా ఓటర్లు, ఎన్నికలు, నమోదు, సవరణలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతీ పోలింగ్ స్టేషన్‌కు సంబంధిత ఓటరు జాబితా అందజేశామని, అందులో తప్పులు ఏమైన ఉంటే సరి చేయించుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు, నాయకుడు దుర్గారెడ్డి పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి నిధులు మంజూరు


వినతి పత్రం అందజేస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

తూప్రాన్: పట్టణ కేంద్రంలో అంబేడ్కర్ సంఘ భవన నిర్మాణంకు మంత్రి హరీశ్‌రావు నిధులు మంజూరు చేసినట్లు ఆ సంఘం నాయకులు శనివారం తెలిపారు. పట్టణంలో అంబేడ్కర్ భవనం శిథిలావస్థకు చేరుకున్న విషయంపై హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో వినతి పత్రం అందజేసినట్లు చెప్పారు. స్పందించిన మంత్రి నూతన భవన నిర్మాణానికి రూ.75 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. గజ్వేల్ నుంచి కేసీఆర్ తిరిగి పోటీ చేయాలని లక్ష మెజార్టీతో గెలిపించుకుంటామని మంత్రికి చెప్పారు. పార్టీ ఫండ్‌కు రూ.5 వేల నగదు అందజేసినట్లు తెలిపారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్, కౌన్సిలర్లు మామిడి వెంకటేశ్, సత్య లింగం, బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ అశోక్, వార్డు అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఎమ్మెల్యే పరామర్శ**

పాపన్నపేట(మెదక్): ఇటీవల మెదక్ మాజీ సమితి అధ్యక్షుడు సంగమేశ్వర్ రెడ్డి మరణించారు. ఆయన కుటుంబాన్ని శనివారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి హైదరాబాద్‌లో పరామర్శించారు. ఆయన గొప్ప ప్రజా నాయకుడని కొనియాడారు. ఆయన కుమారుడు విక్రం, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

◆ **నేడు విద్యుత్ సరఫరా బంద్**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలో వ్యవసాయానికి ఆదివారం విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ దుర్గాప్రసాద్ శనివారం తెలిపారు. మనోహరాబాద్ 132 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా 33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ బోరుబావులకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని రైతులు గమనించగలరన్నారు.

◆ **వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని గౌతోజిగూడెంలో వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ వెంకటేశ్వర్లు గ్రామస్తులకు సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. అపరిశుభ్రతతో డెంగ్యూ, మలేరియా ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు రేణుకుమార్, కార్యదర్శి నందిని, వార్డు సభ్యులు పెంటమ్మ, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

◆ **విజేతలకు బహుమతులు**

పాపన్నపేట(మెదక్): ఎన్నికల అవగాహనపై శనివారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో కొడుపాక ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. ద్వితీయ స్థానం కేజీబీవీ విద్యార్థినులు, తృతీయ స్థానం నాగ్సాన్‌పల్లి పాఠశాల విద్యార్థులు పొందారు. వీరికి బహుమతులు అందజేసినట్లు నోడల్ అధికారి అంజాగౌడ్ తెలిపారు.

◆ **మిల్లు లీజుకు వేలం పాట**

పాపన్నపేట(మెదక్): కొత్తపల్లి సొసైటీ పరిధిలోగల రైస్ మిల్లు లీజుకోసం ఈనెల 21వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు చైర్మన్ త్యార్ల రమేష్ శనివారం తెలిపారు. 2 ఎంటీఎస్ సామర్థ్యంగల లీజు ఏడాది లీజుకు ఇస్తామని, ఆసక్తి గల వారు కొత్తపల్లిలో జరిగే వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

◆ **స్వచ్ఛతతోనే వ్యాధులు దూరం**

అల్లాదుర్గం(మెదక్): స్వచ్ఛతతోనే వ్యాధులు ప్రబలవని రెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. శనివారం గ్రామంలో స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. గ్రామ మహిళా సంఘం సభ్యులు ఇంటింటికి వెళ్లి తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి పంచాయతీ సిబ్బందికి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వీఓఏ, గ్రామ మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

◆ **చెరువులోపడి యువకుడి గల్లంతు**

రామాయంపేట(మెదక్): పట్టణ శివారులో ఉన్న బాలసముద్రం చెరువులో శనివారం స్నానం చేయడానికి వెళ్లిన యువకుడు హర్భజన్‌సింగ్(17) గల్లంతయ్యాడు. అతడి ఆచూకీ కోసం గజఈతగాళ్లు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో రాత్రి కావడంతో గాలింపు నిలిపివేశారు. హర్భజన్‌సింగ్ కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. ఈ విషయమై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రంజిత్ తెలిపారు.

◆ **ఫ్యాక్టరీ అంశం మేనిఫెస్టోలో పెట్టాలి**

మెదక్: మెదక్, కరీంనగర్, నిజామాబాద్‌లో మూతపడిన ఎన్‌డీఎస్‌ఎల్ ఫ్యాక్టరీలను తెరిపించాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ సభ్యుడు శ్రీధర్‌బాబును కోరినట్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హామి ఇచ్చి ఎన్‌డీఎస్‌ఎల్ కార్మికులు, రైతులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్‌డీఎస్‌ఎల్ ఫ్యాక్టరీని తెరిపించే విధంగా ఈ అంశాన్ని మేనీఫెస్టోలో పెట్టాలని కోరినట్లు చెప్పారు.

◆ **కాంగ్రెస్ ప్రచార రథానికి పూజలు**

వెల్దుర్తి(తూప్రాన్): టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి శనివారం మండలంలోని భస్వాపూర్ శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద తన ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, వాహన పూజ అనంతరం రథం ప్రారంభించారు. రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే నర్సాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున బరిలో ఉంటానని ధీమాతో తన సొంత మండలమైన ఉమ్మడి వెల్దుర్తి మండలంలో ఎన్నికల ప్రచార రథం ప్రారంభించడంపై ఆ పార్టీ నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.